# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER - 2018**

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

క్రీస్తు సంఘములు నిర్వహించుచున్న

# POLISHING THE PULPIT అను

## గొప్ప బైబిలు లెక్చర్‌షిప్

| | | |
|---|---|---|
| సమయము | : | 2018 డిశంబరు 2వ తేదీ ఆదివారము నుండి 6వ తేదీ శుక్రవారము వరకు<br>ఉదయం 10 గంటలకు<br>మధ్యాహ్నం 2 గంటలకు మరియు<br>రాత్రి 6.30 ని॥లకు |
| స్థలం | : | సత్యవాణి - క్రీస్తు సంఘము<br>రామారావుపేట, కాకినాడ |

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్వదేశీ, విదేశీ సువార్తికులు వాక్యోపదేశము గావించెదరు. ప్రతి దినము స్త్రీలకు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడును. దూరము నుండి వచ్చు వారికి ఉచిత భోజన వసతి సౌకర్యములు కలవు. మొదటి రోజున 40/-లు మాత్రమే చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొనవలెను. ప్రతి సువార్తికుడు, స్థానిక సంఘ సభ్యుడు, సభ్యురాలు తప్పక పాల్గొనవలెను. ఇది అత్యంత అరుదైన తరుణము. తప్పక వచ్చి ఆత్మీయ లాభము పొందండి.

వివరములకు దిగువ నీయబడిన నెంబర్లును సంప్రదించండి.


రిక్కీ గూటం

రోనీ గూటం

రాబిన్ గూటం

Ph : 0884 - 2363722

98489 98547, 99122 86255, 95021 84284

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

**సంపుటి - 40** **సెప్టెంబర్ - 2018** **సంచిక -2**


## నీవు మారుమనస్సు నొందితివా?

## ( Have you repented? )

మారుమనస్సు అనగా దుష్క్రియలను విడిచిపెట్టి దేవుని తట్టు తిరుగుట యని గత సంచికలో నేర్చుకొనియున్నాము. మనందరము పాపమును విసర్జించి దేవుని తట్టు తిరుగ వలెనని దేవుడు మనకొరకు దీర్ఘశాంతము కలిగి యున్నారు. మనము మారుమనస్సు పొందని యెడల నరకాగ్నిలో నశించి పోవుదుమని ఆయన తెలియజేయుచున్నారు. అయితే నీవు మారుమనస్సు నొందితివా? మారుమనస్సును గూర్చి నిన్ను ప్రేరేపించు నిమిత్తము మరికొన్ని ఉదాహరణలను దైవవేదము నుండి నీకు ఈ రోజు చూపించ గోరుచున్నాను.

**సౌలు యొక్క ఉదాహరణ :** తార్సువాడైన సౌలు మారుమనస్సు అనగా యేమిటో, దానిని పొందుట యెట్లో అపొ.కా. 9వ అధ్యాయములో మనకు నేర్పుచున్నాడు. అతడు యెరూషలేములో యున్న క్రీస్తు సంఘమును ఘోరముగా హింసించెను.

అటు తరువాత దమస్కులో నున్న క్రైస్తవులను హింసించుటకు బయలుదేరి వెళ్ళెను. అతడు దమస్కు దగ్గరకు వచ్చినప్పుడు, అకస్మాత్తుగా ఆకాశమునుండి యొక వెలుగు అతని చుట్టు ప్రకాశించెను. అతడు నేల మీదపడి, సౌలా, సౌలా నీవేల నన్ను హింసించుచున్నావని తనతో ఒక స్వరము పలుకుట వినెను. ప్రభువా, నీవెవడవని అతడడుగా ఆయన - నేను నీవు హింసించుచున్న యేసును. లేచి పట్టణములోనికి వెళ్ళుము, అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడును అని చెప్పెను. సౌలు దమస్కులో ప్రవేశించి మూడు దినములు అన్నపానము లేమియు పుచ్చుకొనకుండెను. అంతట దమస్కులో అందరిచేత మంచి పేరు పొందిన 'వాడైన అననీయ అతని దగ్గరకు పంపబడెను. అతడు సౌలు దగ్గరకు వచ్చి "నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసికొనుమని చెప్పెను" (అపో.కా. 22:16). అతడు లేచి బాప్తిస్మము పొందెను. క్రీస్తు కొరకు అనేక శ్రమలను, బాధలను ఓర్చుచు అందరికంటె అతడు ఎక్కువగా సువార్త చాటించెను. క్రైస్తవులను హింసించిన సౌలు, పౌలుగా మారెను. దుర్మార్గతను విడిచిపెట్టి ప్రభువు తట్టు తిరిగెను. గొప్ప మార్పును తన జీవితములో కనుబరచెను.

**దేవుని చిత్తము జరిగించాలి :** నీవు నీ పాపముల విషయమై మారుమనస్సు నొందిన యెడల సౌలు వలె, ప్రభువా, నేనేమి చేయవలెనని నీవడుగుదువు. నీవు దేవుని వాక్యమును చదివి ఆయన చిత్తమును తెలిసికొందువు. దానిని తెలిసికొని నీ శక్తి సామర్థ్యముల కొలది ఆయన చిత్తమును జరిగింతువు. మారుమనస్సు

పొందిన ప్రతివాడును, "ప్రభువా, నా చిత్తముకాదు, నీ చిత్తమే జరుగును గాక" యని ప్రార్థించును. నీవు క్రీస్తు చిత్తమును నీ జీవితములో జరిగించు చున్నావా?

పాత స్వభావము మార్చాలి : పౌలు మారుమనస్సును గూర్చి మరి కొంత మనకు బోధించుచున్నాడు : "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నా యందు జీవించు చున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్ప గించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించు చున్నాను" (గలతీ 2:20). మనము మారుమనస్సు నొందినయెడల మన పాత పురుషుడు (లేక పాత తత్వము) మరణించవలసి యున్నది. మనలో క్రీస్తు జీవించవలసి యున్నది. అంటే మాట చేత గాని క్రియ చేత గాని మనమేమి చేసినను ప్రభువైన యేసు క్రీస్తు నామమున చేయవలసియున్నది (కొలస్స 3:17). మారుమనస్సు పొందిన వాడెవడును తన స్వేచ్ఛను బట్టి, కోరికలను బట్టి గాక క్రీస్తుయొక్క వాక్యమును బట్టి నడుచుకొనును. దేవుని గ్రంథమునకు ప్రతికూలముగా అతడేమియు చేయకుండును.

మారుమనస్సు పొందిన ప్రతి వ్యక్తియు తాను ఏదైనా చేయకముందు అది దేవుని మహిమపరచునా? యని అడుగును. తన ఆలోచనలు, మాటలు, క్రియలు, అవును అతని సమస్తము దేవుని మహిమార్థమై వినియోగించ ప్రయత్నించును. అందుకే అపొ.పౌలు ఇట్లు బోధించుచున్నాడు : "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశు ద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు,

విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1కొరింథి 6:19,20). "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది" (రోమా 12:1).

పరిశుద్ధత అవుసరము : మనము దేవునికి చేయు సేవ అంగీకరింపవలెనంటె మన తలంపులను, క్రియలను, మన శరీరమును పరిశుద్ధముగా యుంచవలెను. అంటే మారుమనస్సు కలిగి మనము జీవించవలెను. అందుకే మనుష్యులు అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మన ప్రభువు ఆజ్ఞాపించుచున్నారు. ఏ భేదమును లేదు, అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. అయితే మనము పాపమును గూర్చి మారుమనస్సు నొందని యెడల నశించిపోవుదుము అని యేసు క్రీస్తు చెప్పెను.

నీవు క్రైస్తవుడవు కాగోరుచున్న యెడల క్రీస్తునందు విశ్వసించి మారుమనస్సు పొందవలెను. మారుమనస్సు పొందిన తరువాత బాప్తిస్మము పొందవలెను. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అనువరమును పొందుదురు" అని దేవుని వాక్యము బోధించుచున్నది (అపో.కా. 2:38).

క్రైస్తవుడు పాపము చేస్తే : నీవు క్రైస్తవుడవయ్యుండి పాపము చేయుచున్న యెడల నీవు చేసిన ప్రతి పాపమును గూర్చి మారుమనస్సు పొంది, ప్రభువు నిన్ను క్షమించు

నిమిత్తము ప్రార్థన చేయుము. గారడీ వాడయిన సీమోను క్రైస్తవుడయిన తరువాత పాపము చేయగా పేతురు అతనితో "యీ నీ చెడుతనము మానుకొని మారుమనస్సు నొంది ప్రభువును వేడుకొనుము; ఒకవేళ నీ హృదయాలోచన క్షమింపబడవచ్చును" అని చెప్పెను (అపొ.కా. 8:22). పాపము చేసిన ప్రతి క్రైస్తవుడు తన పాపమునుండి మారుమనస్సు పొంది, క్షమాపణ నిమిత్తము ప్రార్థించవలెను. "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రలనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పు కొనిన యెడల ఆయనను అబద్ధికుని గా చేయు వారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 1:9,10). ఒకవేళ సంఘ మంతయు పాపము చేసిన యెడల సంఘమంతయు మారుమనస్సు పొందవలసి యున్నది. అట్టి సంఘము నకు "నీవు ఏ స్థితిలో నుండి పడిపోతివో జ్ఞాపకము చేసికొని మారు మనస్సు పొంది ఆ మొదటి క్రియలను చేయుము" అని ప్రకటన 2:5లో ప్రభువు చెప్పుచున్నారు.

నీవు మారుమనస్సు నొందితివా? నీ ఆత్మీయ క్షేమము కొరకు నీవు మారుమనస్సు పొందవలసి యున్నది. నీవు మారుమనస్సు పొందవలెనని ప్రభువు ప్రేమ నిన్ను ప్రేరేపించుచున్నది. నిన్ను పాపము నుండి రక్షించుటకే గదా యేసుక్రీస్తు సిలువపై చనిపోయెను! నీవు మారుమనస్సు పొందని యెడల నిత్యాగ్నిలో నశించిపోదువు సుమా!

# ఇదిగో చూడు, దేవుడున్నాడు!

## ( Look There is God )

"ఎవడైనను ఎప్పుడైనను దేవుని చూడలేదు" అని యోహాను చెప్పాడు (యోహాను 1:18). "మీరు ఏకాల మందైనను ఆయన స్వరము వినలేదు, ఆయన స్వరూపము చూడలేదు" అని యేసు చెప్పెను (యోహాను 5:37). దేవుడు మోషేతో, "నీవు నాముఖము చూడజాలవు; ఏనరుడును నన్ను చూచి బ్రదుకడని" చెప్పెను (నిర్గమ 33:20). "దేవుడు ఆత్మయై యున్నాడు" (యోహాను 4:24). అందువలన ఆయన మన భౌతిక నేత్రములకు అగోచరుడు (కొలస్స 1:15; 1 తిమో 1:17). సమీంపరాని తేజస్సులో ఆయన వసించును (1తిమో 6:16).

అయినను ఆయనకు అసాధ్యమైనది యేదీ లేనందున కొన్ని సమయాల్లో తన్ను తాను ప్రత్యక్ష పరచు కొనుటకు ఆయనకు అభీష్టమాయెను. ఆయన యాకోబుతో పోరాడారు (ఆది. కా. 32:24,30). అబ్రాహాము ఆయనతో సంభాషించాడు (ఆది.కా. 18:22-32). మోషే, అహరోను, నాదాబు, అబీహులు మరియు డెబ్బది మంది పెద్దలును "ఇశ్రాయేలీయుల దేవుని చూచిరి. ఆయన పాదముల క్రింద నిగనిగలాడు నీలమయమైన వస్తువు వంటిదియు ఆకాశమండలపు తేజము వంటిదియు ఉండెను. వారు దేవుని చూచి అన్నపానములు పుచ్చు కొనిరి" (నిర్గమ 24:9-11). తదుపరి మోషే "దేవుని వెనుక పార్శ్వమును చూచెను" (నిర్గమ 33:23). అయినను దేవుని తత్వమంతయు ఆత్మయై యున్న ందునను, మన భౌతిక నేత్రములు ఆత్మలను చూడలేనందునను, చెప్పా లంటే నిజానికి ఏ మానవుడును దేవుని చూడలేదు.

అయినను మనము దేవుని "చూడగలము". "హృదయ శుద్ధిగల

వారు ధన్యులు, వారు దేవుని చూచెదరు” అని యేసు చెప్పారు (మత్తయి 5:8). మనం పరలోకములో దేవుని చూచెదమని యేసు చెప్పుట లేదు. “వారు దేవుని చూచుచు యుండెదరు” అని ఆ మాటల యొక్క అక్షరార్ధము, ఇప్పుడు ఇక్కడ ఆయనను మనం చూడకుంటే ఆయనను ఎన్నడైనా చూచెదమనే వాగ్ధానము మనకు లేదు.

అదృశ్యమైన దానిని మనం ఎట్లు చూడగలము? “విశ్వాసమును బట్టి అదృశ్యమైన వానిని చూచు చున్నట్లు...” (హెబ్రీ 11:27). ఆయనను చూచుటకు మనం యత్నించిన యెడల దేవుని మనం చూడగలము. న్యూయార్కు పట్టణము ను గూర్చి ఇద్దరు మనుష్యులు మాటలాడు కొనుచుండిరి. న్యూయార్కు ఘోరమైనదని, దుష్టులతో ను, పాపముతోను నిండికొని యున్న పట్టణమని ఒకడు అభిప్రాయపడ్డాడు. మరియొకడు ఆ మహానగరము కళల తోను, సాంస్కృతితోను, విజ్ఞానము తోను వికసించుచున్నదని చెప్పాడు. వీరిలో ప్రతి ఒక్కడు తాను వెదుకు చున్నదానిని కనుగొన్నాడు! అట్లే మనము కూడ దేనికొరకైతే శిక్షణ పొందామో దానిని తప్పక చూస్తాము. మన జీవితంలో ప్రతిఘట్టములోను, ప్రతి ఘడియలోను, దేవుని చూచుటకు మనము సిద్ధపడాలి.

**క్రీస్తులో మనం దేవుని చూడగలము**

‘నన్ను చూచినవాడు దేవుని చూచి యున్నాడని’ యేసు ఫిలిప్పుతో చెప్పారు (యోహాను 14:8,9; హెబ్రీ 1:1-3). ఒకడు తన నేత్రములను వినియోగించకుండగానే ఈలోకంలో దేవుని చూడగలడు. నిజానికి ఎక్కడ చూడాలో తెలిస్తే గ్రుడ్డివారు కూడ అనుదినము దేవుని చూడగలరు. యేసు నాటి కాలములో అనేకులు

ఆయనను చూచారు గాని, ఆయనలో కేవలం మనుష్యుని మాత్రమే చూచారు. ఆయన వారికి లేత మొక్కవలెను, ఎండిన భూమిలో మొలిచిన మొక్క వలెను, సురూపముగాని, సొగసు గాని లేని వానిగను అగుపడెను (యెషయా 53:2). వారెవరిని చూచు చున్నారో గ్రహించ కుండా వారాయనను చూచారు. మిగతా వారు కూడా అదే భౌతిక యేసును చూచారు గాని వారాయన ముఖము చూడగానే దేవుని గుర్తిం చారు. వారాయనతో సహవాసము చేయగా, "నీవు సజీవుడ వగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని ఒప్పు కొన్నారు (మత్తయి 16:16). యేసు పరలోకమున కెక్కి వెళ్ళిపోయిన తరువాత కూడా వారాయనను చూస్తు యుండిరి. కండ్లతో మాత్రమే చూచు వారు చూచేది బహుస్వల్పమే.

సర్ ఐజక్ న్యూటన్ అను శాస్త్రజ్ఞుడు ఇట్లు చెప్పాడు : "నేను ఖగోళ దర్శిని ద్వారా ఆకాశములో కోట్ల కొలది మైళ్లు చూడగలను. గాని నేను దానిని ప్రక్కనపెట్టి, నా గదిలోనికి వెళ్లి తలుపు మూసికొని, మోకాళ్లని ప్రార్థించేటప్పుడు పరలోకాన్ని ఎక్కువ చూడగలను మరియు ఖగోళ దర్శిని కంటే నా దేవునికి సమీపముగా యుండగలను".

"దేవుని యొద్దకు రండి అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:8).

### ప్రకృతిలో మనం దేవుని చూడగలము

మామూలుగా మనం రాత్రివేళ ఆకాశములోనికి చూచిన యెడల అక్కడక్కడా చుక్కలను చూడగలము. ఖగోళ శాస్త్రజుఞడు వాటిని చూచి ఆ నక్షత్రములను వాటి పేళ్లను కూడ చెప్పును. నావికుడు అదే నక్షత్రములను చూస్తు తన ఓడను గమ్యమునకు చేర్చును. దావీదు కూడ అదే అంతరిక్షాన్ని చూచి దేవుని

మహిమను కనుగొన్నాడు! (కీర్తన 19:1-6).

మన భౌతిక నేత్రములతో రాత్రి వేళ రెండు లేక మూడు వేల నక్షత్రములను మనము చూడగలము. ఉత్తర ధృవతార, పొలారిస్ మనకు దగ్గరగా యున్నట్లు కనబడును గాని దాని నుండి వెలువడిన వెలుగు మనకు వచ్చుసరికి 407 సంవత్సరములు పట్టునని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. అంతేకాకుండా కొన్ని నక్షత్రములు మనకు 3000 కాంతి సంవత్సరముల దూరములో యున్నాయి.

కుందేళ్లను గూర్చి, నక్కలను గూర్చి మరియు అట్టి జంతువులను గూర్చి మనం అనేక కథలు చదువుదుము. క్రైస్తవులు ఆ జంతువులను చూచి దేవుని యొక్క నమూనాను ఆయన జ్ఞానాన్ని పరికింతురు (సామె 30:24-28). మానవ శరీరమును పఠించి దానిని నిర్మించిన దేవుని యొక్క అమితజ్ఞానాన్ని గూర్చి ఆశ్చర్యపడుదుము. "నీవు నన్ను కలుగ జేసిన విధము చూడగా భయమును, ఆశ్చర్యమును నాకు పుట్టు చున్నవి. అందును బట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాను" (కీర్తన 139:14). దేవుని అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్య శక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టించబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులైయున్నారు" అని పౌలు చెప్పాడు (రోమా 1:20). నిజంగా అది మన దేవుని ప్రపంచము!

### మన ఆశీర్వాదములలో దేవుని చూడగలము

దేవుని అనుగ్రహము యొక్క నిదర్శనములు మన చుట్టూయున్నవి" శ్రేష్టమైన ప్రతియీవియు సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధమైనదై

జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి వచ్చును. ఆయన యందు ఏ చంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏ ఛాయయైనను లేదు" (యాకోబు 1:17). దేవుని యొక్క అనుగ్రహైశ్వర్యము లేకుండా మనం ఊపిరి పీల్చుకోలేము, గుప్పెడు అన్నం తినలేము, చిరునవ్వును ఆస్వాదించలేము, సూర్యరశ్మిని అనుభవించలేము.

నీవు దేవుని చూడగోరుచున్నావా? శుద్ధహృదయము కలిగి యుండుటయే దానికి మార్గము (కీర్తన 17:15; 41:12; 42:1; 63:1,2; 140:13; యెాబు 42:5). హృదయం పవిత్రముగా యుంటే ఆత్మీయ నేత్రములు తెరువబడును, దేవుడు ప్రత్యక్షమగును (ఫిలిప్పీ 1:9-11). పాపము సత్యమును మరుగుపరచును (యోహాను 3:19,20; మత్తయి 1:9-11; 1 కొరింధి 2:14,15; తీతు 1:15,16; 1 యోహాను 3:6). అజ్ఞానము దుష్టత్వము రెండు కలిసే ఉంటాయి.

మన హృదయములను పవిత్రముగా యుంచితే రాబోవు లోకములో దేవుని చూడగలమని మన ప్రభువైన వాగ్దానము చేసారు (యోబు 19:26,27; 1 కొరింధి 13:12; హెబ్రీ 12:14). ఆత్మయైన వానిని మనం చూడగల్గునట్లు మన నేత్రములు ఎట్లు మార్పుజెందునో అది యింకా ప్రత్యక్షపరచబడలేదు (1 యోహాను 3:2). అయినను ఆయన యున్నట్లుగానే మనం ఆయనను చూతుమని మన మెరుగుదుము. "ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖ దర్శనము చేయుచుందురు" (ప్రకటన 22:3,4; 5:13,14; 11:16-19; 2 థెస్స 1:10).

ఇదిగో చూడు! దేవుడున్నారు!!

– ఎలెన్ వెబ్‌స్టర్

# యెఫ్తా యొక్క కుమార్తె

## ( Jephtha's Daughter )

న్యాయాధిపతులు 11:29- 40 లో వ్రాయబడిన యెఫ్తాను గూర్చియు అతని కుమార్తెను గూర్చియు బైబిలు విద్యార్థులందరు ఎరిగియే యుందురు. యెఫ్తా ఇశ్రాయేలీయుల యొక్క న్యాయాధిపతి కాగా "యెహోవా ఆత్మ యెఫ్తా మీదికి రాగా అతడు గిలాదు లోను, మనష్షేలోను సంచరించుచు గిలాదు మిస్పేలో సంచరించి గిలాదు మిస్పే నుండి అమ్మోనీయుల యొద్దకు సాగెను" (న్యాయా 11:29).

"అప్పుడు యెఫ్తా యెహోవాకు మ్రొక్కుకొనెను, ఎట్లనగా నీవు నా చేతికి అమ్మోనీయులను నిశ్చయముగా అప్పగించిన యెడల, నేను అమ్మోనీయుల నుండి క్షేమముగా తిరిగి వచ్చునప్పుడు నన్ను ఎదుర్కొనుటకు నా యింటి ద్వారము నుండి బయలుదేరి వచ్చునదేదో అది యెహోవాకు ప్రతిష్ఠితమగును; మరియు దహన బలిగా దానిని నర్పించెదననెను" (న్యాయా 11:30,31). యెఫ్తా అమ్మోనీయులను ఇశ్రాయేలీయుల యెదుట నిలువకుండ అణచివేసెను. అయితే అతడు తన యింటికి తిరిగి వచ్చినప్పుడు అతని కుమార్తె అతని ఎదుర్కొనెను (న్యాయా 11:32-34). అనగా అతని మాట ప్రకారము ఆమె యెహోవాకు ప్రతిష్ఠతమాయెను, మరియు దహన బలిగా అతడామెను అర్పించ బద్ధుడాయెను. "అతడు తాను మ్రొక్కుకొనిన మ్రొక్కుబడి చొప్పున ఆమెకు చేసెను" అని న్యాయా 11:39లో వ్రాయబడియున్నది.

యెఫ్తా తన కుమార్తెను అక్షరార్ధముగా దహనబలిగా అర్పించెనా? అది సాధ్యమా? (11: 29-40). అవును అది సాధ్యమే. (విచారం యేమంటే చరిత్రలో అనేక

మంది పిల్లలు శక్తివంతమైన నాయకుల వలన బలిఅర్పించబడ్డారు. వారిలో యూదాను పాలించిన దుష్ట రాజులు కూడ లేకపోలేదు (2 దినవృ 28:1-3; 33:6-9). అయితే యెఫ్తా నిజముగా తన కుమార్తెను బలిగా యిచ్చియుంటే అతడొక ఘోరపాపము చేసిన వాడగును. ఏలయనగా మానవులను దహనబలిగా అర్పించు టను దేవుడు ఖండించారు (ద్వితీయ 12:31; 18:10). ఇంకా యేమంటే యెఫ్తా తన కుమార్తెను దహనబలిగా దేవునికి అర్పించియుంటే తన చర్యల కు దేవుని అనుమతి లేకుండా చేసి యుండెను (ఈ విషయంలో దేవుని మౌనము ఆయన అంగీకారము కాదు).

యెఫ్తా యొక్క సమస్యకు శ్రేష్టమైన జవాబు యేమంటే కొన్ని సార్లు "ఆబలి" అలంకార రీతిగా అర్పించబడుచుండెను. ఆధునికంగా మనం మన సమయాన్ని ధనాన్ని, నిద్రను, శక్తిని సత్క్రియల కొరకు త్యాగం (బలి యిచ్చుచున్నట్లు) చేయు చున్నట్లు చెబుతూయుంటాము. యిట్టి అలంకార రూపకమైన బలియాగము పూర్వము ఇశ్రాయేలులో కూడ యుండె నని గమనించుము. ముందునుండే, ఇశ్రాయేలీయులు ఐగుప్తులో పదియవ తెగులు (జ్యేష్ఠ సంతానము మరణము) తరువాత, ఇశ్రాయేలు ప్రజలు దేవునికి జంతువులను మనుష్యులను కూడ అర్పించారు. "ఇశ్రాయేలీయులలో మనుష్యుల యొక్కయు పశువుల యొక్కయు ప్రధమసంతతి అనగా ప్రతి తొలిచూలు పిల్లను నాకు ప్రతిష్టించుము, అదినాదని" యెహోవా దేవుడు చెప్పెను (నిర్గమ 13:27). ఒక విధముగా 'మగదైన ప్రతి తొలిచూలు పిల్ల" యెహోవాకు బలిగా అర్పించ బడెను (నిర్గమ 13:15).

అయితే మగదైన తొలిచూలు దేవునికి ప్రత్యేకముగా ఎట్లు అర్పించ బడిరి? వారందరు అక్షరార్ధముగా దేవునికి దహనబలిగా అర్పించబడిరా? పవిత్ర జంతువుల తొలి మగ

సంతానము దహనబలిగా అర్పించ బడేది గాని గాడిద లాంటి అపవిత్ర మైన జంతువుల తొలిపిల్లను వెలయిచ్చి విడిపించి దానికి ప్రతిగా గొర్రెపిల్లను ప్రతిష్ఠింపవలెను (నిర్గమ 13:13; సంఖ్యా 18:15). అనగా ఆ గాడిద బలియై మరణించకుండా దాని స్థానముననే వేరొకటి అర్పించవలెను.

ఇశ్రాయేలీయులలో తొలిచూలు మగపిల్లను బలిగా అర్పించుటకు బదులు (నిర్గమ 13:2, 12-16; 22:29-30), దేవుడు లేవీయులను తన సేవార్థమై ప్రత్యేక పరచెను. 'లేవీయులు యెహోవా సేవ చేయు వారవుటకు" ప్రతిష్ఠార్పణముగా వారు ప్రతిష్టింపబడిరి (సంఖ్యా 8:11).

దేవుడిట్లు చెప్పారు : "ఇశ్రాయేలీయులలో నుండి లేవీయులను నా వశము చేసికొనియున్నాను. ప్రతి తొలిచూలియు నాది గనుక లేవీయులు నావారై యుందురు. ఐగుప్తు దేశములో ప్రతి తొలిచూలును నేను సంహరించిననాడు మనుష్యుల తొలిచూలుల నేమి పశువుల తొలి చూలులనేమి ఇశ్రాయేలీయులలో అన్నింటిని నా కొరకు ప్రతిష్ఠించు కొంటిని, వారు నా వారైయుందురు. నేనే యెహోవాను" అని ఆయన చెప్పెను (సంఖ్యా 3:12,13).

పవిత్రజంతువులు దేవునికెట్లు అర్పించబడెను? దహనబలిగా, అక్షరార్ధముగా ప్రజలలో తొలిచూలు మగ వారు దేవునికెట్లు అర్పించబడిరి? అక్షరార్ధముగా దహనబలిగా గాక, త్యాగపూరితమైన సేవచేయుట ద్వారా అర్పించబడిరి (రోమా 12:1).

లేవీయులు దేవుని సేవార్థమై ప్రతిష్టింపబడుట ఒక విధమైన అర్పణ యని లేవీకాండము 8వ అధ్యాయము తెలియజేయుచున్నది. దేవుడు మోషేకు ఈలాగు సెలవిచ్చును : "నీవు యెహోవా సన్నిధికి లేవీయులను తోడుకొని వచ్చిన తరువాత ఇశ్రాయేలీయులు తమ చేతులను ఆ

లేవీయుల మీద ఉంచవలెను. లేవీయులు యెహోవాసేవ చేయు వారవుటకు అహరోనును ఇశ్రాయేలీయులును ప్రతిష్టార్పణము గా వారిని యెహోవా సన్నిధిని ప్రతిష్టింప వలెను. లేవీయులు ఆ కోడెల తలమీద తమ చేతులుంచిన తరువాత నీవు లేవీయుల నిమిత్తము ప్రాయ శ్చిత్తము చేయునట్లు యెహోవాకు వాటిలో ఒక దానిని పాప పరిహార్ధ బలిగాను రెండవదానిని దహన బలి గాను అర్పించి అహరోను ఎదుటను అతని కుమారుల యెదుటను లేవీయులను నిలబెట్టి యెహోవాకు ప్రతిష్టార్పణముగా వారిని అర్పింప వలెను. అట్లు నీవు ఇశ్రాయేలీయు లలో నుండి లేవీయులను వేరుపరచవలెను. లేవీయులు నావారై యుందురు. తరువాత నీవు వారిని పవిత్రపరచి ప్రతిష్టార్పణముగా వారిని ప్రతిష్టించు నప్పుడు లేవీయులు ప్రత్యక్షగుడారము లో సేవచేయుటకై లోపలికి వెళ్ళ వచ్చును. ఇశ్రాయేలీయులలో వారు నా వశము చేయబడినవారు, తొలిచూలి యైన ప్రతివానికి అనగా ఇశ్రాయేలీయులలో ప్రధమ సంతాన మంతటికిని ప్రతిగా నేను వారిని తీసికొని యున్నాను. ఏలయనగా మనుష్యులలోను, పశు వులలోను, ఇశ్రాయేలీయులలో తొలిచూలియైన ప్రతివానికి మారుగా వారిని నా కొరకు ప్రతిష్టించుకొంటిని. ఇశ్రాయేలీయు లలో తొలిచూలియైన ప్రతివానికి ప్రతిగా మారుగా లేవీయులను తీసికొని యున్నాను" (సంఖ్యా 8:10–18).

లేవీయులు సాదృశ్యముగా దేవుని యెదుట అర్పించబడినట్లు యెఫ్తా కూడ తన కుమార్తెను సాదృశ్యముగా దేవుని అర్పించి యుండ వచ్చుననునది దృఢము. ఆమె ప్రత్యక్ష గుడారము దగ్గర దహనబలిగా అర్పించబడియుండ వచ్చును ఎట్లునగా ఆమె ప్రత్యక్ష గుడారము

యొక్క ద్వారము యొద్ద సేవించే సేవకు రాం(డ్రలలో ఒకతెగా అర్పించబడెను (నిర్గమ 38:8, 1 సమూ 2:22). కొన్ని శతాబ్దముల తరువాత అన్నా వలె యెఫ్తా యొక్క కుమార్తె కూడ "దేవాలయము విడువక ఉపవాస ప్రార్ధనలతో రేయింబవళ్లు" బహుశ ఆమె సేవ చేయుచుండెను (లూకా 2: 36–38).

యిట్టి సాదృశ్య రూపక అర్పణ వాస్తవము. ఏలయనగా యెఫ్తా యొక్క కుమార్తె గాని ఆమె చెలికత్తెలు గాని ఆమె మరణమును గూర్చి యెన్నడును ప్రలాపించలేదు. వారు ఆమె మరణ మును గూర్చి కాదు గాని తన కన్యాత్వమును గూర్చి ప్రలాపించెను (న్యాయాధి 11:38). నిజానికి ఆమె కన్యాత్వమును గూర్చి మూడు మారులు ప్రస్తావించబడెను (11:37 –39). యెఫ్తా తాను మ్రొక్కుకొనిన మ్రొక్కుబడి చొప్పున ఆమెకు చేసినను దానికి ముందే ఆమె కన్యాత్వమును గూర్చి ప్రలాపించినట్లు ఆఖరిగ ప్రస్తావించ బడెను. మరియు ఆమె పురుషుని ఎరుగనేలేదు.

యెఫ్తా నిజంగా ఆమెను చంపి దహన బలిగా అర్పించియుంటే ఆమె కన్యాత్వమును గూర్చి పదేపదే ప్రలాపించుట అర్ధరహితము. సరిగదా యెఫ్తా యొక్క కుమార్తె దేవుని ఆలయ ద్వారము దగ్గర పనిచేయుచు యుండుటకు అర్పించబడిన యెడల, తన శేషజీవితమంతయు ఏకాకిగా, బిడ్డలు లేనిదానిగా దేవుని సేవ చేయుట కర్పించబడె ననుటలో అర్థమున్నది. గనుక తాను, తన చెలికత్తెలు కూడ ఆమె యొక్క కన్యాత్వమును గూర్చి ప్రలాపించుట యోగ్యమే.

బైబిలు సంగతులను బైబిలునే జవాబిచ్చుటకు మనము సహకరించిన యెడల యెఫ్తా కుమార్తె యొక్క సాదృశ్య రూపక అర్పణను మనము సరిగా గ్రహించుకోగలము!

– ఎరిక్ లాయెన్స్

# నాలుక సమస్యలను తెచ్చునా ?

## ( The Tongue Causes Troubles?)

"ఆలాగుననే నాలుక కూడ చిన్న అవయవమైనను బహుగా అదిరి పడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును?" అని పరిశుద్ధాత్మావేశ లేఖకుడగు యాకోబు చెప్పాడు (యాకోబు 3:5). చిన్న అగ్గిపుల్ల పెద్ద అడవిని తగల బెట్టును. అమెరికాలో కేలిఫోర్నియా అడవులలో రగిలిన కార్చిచ్చు చిన్న అగ్గిపుల్ల వలన సంభవించెను! గనుక నాలుక చిన్న అవయవమే అయినను దేశముల మధ్య యుద్ధమును రగిలించును, కుటుంబాలను విడదీయును, సంఘములో సంక్షోభ ములు కలుగుజేయును.

నాలుక జారిపడే ప్రదేశములో యున్నది గాని దానిని దంతములు, పళ్ళు కాపలాకాయునని ఒకరు చెప్పారు, నాలుకను సరిగ ఉపయోగిం చకపోతే పాపపు అపరాధములో పడగలము. "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటి కంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడు కొనుము" (సామె 4:23). ఒకడు ఎట్లు తలంచునో, అట్లే ప్రవర్తించును. ఏలయనగా "హృదయము నిండి యున్న దానిని బట్టి నోరుమాటలాడు ను" (మత్తయి 12:34).

నాలుకను మంచికి గాని, చెడుకు గాని వినియోగింప వచ్చును. క్రీస్తునామమును దానితో ఒప్పుకొన వచ్చును లేదా దూషించవచ్చును. ఒకని కొకడు సహాయపడవచ్చును లేదా హాని చేసుకోవచ్చును. దేవుని నారాధించుటకు గాని, దేవదూషణకు గాని నాలుకను వినియోగింపవచ్చును (కొలస్స 3:8). ఒకని నొకడు మోసగించుటకు నాలుక వినియోగ పడును (రోమా 3:13). ఒండొరులను గూర్చి మనం నాలుకతో గుసగుస లాడవచ్చును వారి జీవితమును నాశనం చేయవచ్చును. మరియు జారిన మాటలను వెనుకను తీసికి కొనలేము (రోమా 1:29). మంచి మిత్రులను విమర్శిస్తూ, వారిని గూర్చి

కొండెములాడుట వలన ఒకని నొకడు కరుచుకొనునట్లు నాలుకను ఉపయోగించవచ్చును, "అయితే మీరు ఒకని నొకడు కరచుకొని భక్షించిన యెడల మీరు ఒకని వలన ఒకడు బొత్తిగా నశించిపోదురేమో చూచు కొనుడి" యని అపో.పౌలు హెచ్చరిం చాడు (గలతీ 5:15).

క్రైస్తవులు ఎన్నడు అబద్ధమాడ రాదు గాని నాలుక అబద్ధము చెప్ప గలదు! ఒకనితో నొకడు అబద్ధమాడకుడి యని క్రైస్తవులు హెచ్చరింపబడ్డారు (కొలస్స 3:9; ప్రకటన 21:8). నాలుక పలుకు వ్యర్థమైన మాటల వలన ఒకడు తీర్పు దినమున విమర్శకులోనగును (మత్తయి 12:36). మనము స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమములో యుండినను, మీనోట బూతులను విసర్జించుడియని హెచ్చరిక చేయ బడ్డాము (కొలస్స 3:8). కృతజ్ఞతా వచనమే మీరుచ్చరింప వలెను గాని మీరు బూతులైనను పోకిరి మాటలైనను, సరసోక్తులనైనను ఉచ్చరింపకూడదు, ఇవి మీకు తగవు" అని పౌలు క్రైస్తవులను హెచ్చరించాడు (ఎఫెసీ 5:4).

సహోదరులను ప్రోత్సహించుటకు, మన పరలోకతండ్రిని ఆరాధనలో ఘనపరచుటకు, మన బిడ్డలను ప్రభువు యొక్క బోధలోను, శిక్షలోను పెంచుటకు మన నాలుకను వినియోగిస్తే అది ఎంత ఆశీర్వాదకరమో! (ఎఫెసీ 6:4). ప్రభువు ఆజ్ఞాపించిన రీతిగా సర్వలోకమునకు సువార్త ప్రకటించుటకు మన నాలుకను వినియోగింప వచ్చును. (మార్కు 15:15,16). నశించిన వారికి ప్రేమ గల రక్షకుని గూర్చి మనం చెప్పగలము, ఆయన సంఘమును గూర్చి, ఆయన రక్షణ మార్గమును గూర్చి యితరులకు చెప్పుటకు మన నాలుకను వినియోగించాలి. మరల విశ్వాసము, మారు మనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మమును గూర్చి చెప్పుటకు మన నాలుకను వినియోగించాలి. మన నాలుకను సద్వినియోగము చేయుటకు జాగ్రత్త పడుదము.

– గేరీకోలి

# నమ్మశక్యము కాని యేసు
## (Incredible Jesus)

రేడియో, టి.వి., వార్తాపత్రికలు, మేగజైన్లు, పుస్తకాలు మొదలగు ప్రచార సాధనములు వలన మనము ప్రజలను గూర్చి తెలిసికొనుటకు, వారితో సానుభూతి కలిగియుండుటకు మనకు సాధ్యపడును. క్రొత్తనిబంధనలోని నాలుగు సువార్తల ద్వారా (మత్తయి, మార్కు, లూకా, యోహాను) చదువరులకు యేసు పరిచయము చేయబడును. ఈ నలుగురు లేఖకులు యేసు సమ్మ శక్యముగాని సంగతులు తన్ను గూర్చి చెప్పారనీ, నమ్మశక్యము కాని మాటలు పలికారని, నమ్మశక్యముకాని పనులు చేసారని మనకు చెబుతారు.

**యేసు తన్ను గూర్చి శక్యము కాని ఆరోపణలు చేసికొన్నారు :**

దీనిని గూర్చి ఆలోచించుము! ఆయన ఈలోక రక్షకుడనని, రాజులకు రాజునని, సర్వసృష్టికర్తననీ చెప్పుకొన్నారు. "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను" అని యేసు చెప్పుకొన్నారు. తాను జీవాహారమునని చెప్పుకొన్నారు. దేవుని గొర్రెపిల్లయని, దేవుని కుమారుడనని ఆయన చెప్పుకొన్నారు!

ఈలాగు చెప్పుకొనే వానినెవనినైనా మనము వీధిలో కలసికొంటే, అతని గూర్చి ఏమనుకొంటాము? అతని యొక్క మతిస్థిమితమును మనం శంకించుదుము, గాని యేసు అయితే తన్ను గూర్చి పైన చెప్పినట్లే చెప్పుకొన్నారు.

**యేసు నమ్మశక్యము కాని క్రియలను, అద్భుతములను చేసారు :**

గ్రుడ్డి వారికి ఆయన చూపునిచ్చారు, కుంటివారు నడిచారు, చనిపోయిన వారిని ఆయన మరల బ్రతికించారు! ఆకలిగొన్న వారికి యేసు ఆహారము నిచ్చారు, నిరుత్సాహ భరితులను ఉత్సాహ పరిచారు, మారు

మనస్సు పొందిన పాపులకు నూతన జీవితము నిచ్చారు. ప్రజలలో ఏమున్నదో ఆయన ఎరుగును. ఆయన వారిని అర్ధము చేసికొన్నారు. యేసు ప్రజలతో ప్రజలమధ్యనే యుండేవారు. ఆయన వారిని హత్తుకొన్నారు.

యేసు బీదలను కనికరించారు. ఆయన మురికిని గూర్చి భయపడ లేదు. బీదతనమును గూర్చి భయపడ లేదు. అపరిచితులను గూర్చి భయపడలేదు. ఆయన ప్రజలను గూర్చి చింతించేవారు, అంతే. అన్నిటికంటే ముఖ్యముగా ఆయన మానవజాతి కొరకు తన్నుతాను అప్పగించు కొన్నారు, సిలువవేయబడ్డారు, చంప బడ్డారు గాని మూడవదినమున సజీవు డై సమాధి నుండి ఆయన తిరిగి లేచారు. యేసు యొక్క మరణము ద్వారా మన పాపములు క్షమించ బడ్డాయి. మనము నూతన జీవమును పొందవచ్చును. అవును యేసు నమ్మ శక్యము కాని పనులెన్నో చేసారు.

**యేసు నమ్మశక్యము కాని మాటలు పలికారు :**

యేసు పలికిన కొన్ని మాటలను వినుడి. “ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు పరలోక రాజ్యము వారిది.” నీతి నిమిత్తము హింసింప బడు వారు ధన్యులు పరలోక రాజ్యము వారిది. నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకు నప్పుడు మీరు ధన్యులు. “నేను మీతో చెప్పునదేమనగా మీరు పరలోక మందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్ధన చేయుడి”. “మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధము లను క్షమింపడు'' (మత్తయి

5:3,10,13,14, 44; 6:14,15). యేసు యొక్క ఈ మాటలను మొదటిగా విన్నవారు ఆశ్చర్యపడిరి. ఈ రోజు అదే మాటలను నీవు నేను కూడ విని ఆనందించవచ్చును. వాటి వలన మనము ప్రోత్సాహించ బడవచ్చును.

**యేసు ఆశ్చర్యమైన సంగతులు తన్ను గూర్చి చెప్పుకొనెను :**

యేసు ఆశ్చర్యమైన క్రియలు చేసెను, ఆశ్చర్యమైన మాటలు పలికెను. అయితే ఈ యేసును గూర్చి నీ అభిప్రాయ మేమిటి? నీవాయన మాటలను నమ్ముదువా? ఆయన లోక రక్షకుడని, రాజులకు రాజని, జీవాహార మని, సృష్టికర్తయని, దేవుని కుమారుడని నమ్ముదువా? నీ జీవితంలో ఆయన ఆశ్చర్య సంగతులు చేయాలని కోరు చున్నావా? నీ పాపములను ఆయన క్షమించి, నీ జీవితాన్ని ఆయన మార్చాలని కోరుచున్నావా? ఆశ్చర్యమైన ఆయన మాటలను నీవు నమ్ముచున్నావా? నీ జీవితాన్ని వాటి ద్వారా ప్రభావితం చేయాలని కోరుచున్నావా? నీవు బైబిలును ఎక్కువ చదివి ఆయనను మరింత ఎక్కువగా తెలిసికోవాలని కోరుచున్నాను.

- ఎడ్‌షార్ట్


## ఉచిత బైబిలు కోర్సు

**మీ యింటిలోనే ఉండి బైబిలు సత్యములను తెలిసికొనండి. మేమిచ్చు బైబిలు కోర్సులో చేరండి. పోస్టుద్వారా ఆ పాఠములను ఉచితంగానే పొంది దానిని పూర్తిచేయగానే ఒక బైబిలు గ్రంథమును ఉచితముగా పొందండి. దిగువ అడ్రసుకు నేడే వ్రాయండి.**

**సత్యవాణి**

పోస్ట్ బాక్స్ నెం. 80, కాకినాడ - 533 001.

ఫోన్ : 0884 - 2363722

# సంక్షిప్త వార్తలు

2018 ఆగష్టు 7వ తేదీన రాబిన్ గూటం గారు రేచల్ గూటం గారు వారి కుమారుడు రాయన్ గూటం గారు అమెరికాలో జరుగుచున్న **POLISHING THE PULPIT** సభలలో పాల్గొనుటకు బయలుదేరిరి. ఆగష్టు 9వ తేదీ రాత్రికి (అమెరికా కాలమాన ప్రకారము) వారు మెంఫిస్ పట్టణము చేరుకొనగా అక్కడే నివసించుచున్న రోనీ గూటం గారు వారిని విమానాశ్రయములో కలసికొని తమ గృహమునకు తోడ్కొని వెళ్లిరి.

2018 ఆగష్టు 17వ తేదీ గురువారం ఉదయం నుండి 24వ తేదీ గురువారం సాయంత్రం వరకు అమెరికాలో టెన్నిసీ రాష్ట్రములో **POLISHING THE PULPIT** మహాసభలు జరిగెను. 5,207 మంది హాజరై దేవుని కీర్తించుచు గంభీరోపన్యాసములను తమ దైవ గ్రంథము నుండి వినుచు పరలోకానందమును భూమిమీదనే అనుభవించిరి. ఇండియా నుండి జాషువా గూటం గారి ముగ్గురు కుమారులు ప్రత్యేక ఆహ్వానితులుగా యుండి అందరి మన్ననలను అక్కడ పొందిరి. ఆ కార్యక్రమ ముఖ్య నాయకుడు ఎల్స్ వెబ్‌స్టర్ గారు ముఖ్యముగా ఇండియా వైపు ఆకర్షితులయ్యిరి. 'పోలిషింగ్ ద పుల్‌పిట్' అను ఈ కార్యక్రమమును ఇండియాలో జరిపించులాగున గూటం సహోదరులు ప్రయత్నము చేయుచున్నారు. అందు విషయమై చదువరులు ప్రార్థించమనవి.

2018 సెప్టెంబరు 18వ తేదీ మంగళవారం నుండి 11 వారముల పాటు ప్రతి మంగళవారము సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణములో **FISHERS OF MEN** (మనుష్యులను పట్టు జాలరులు) అను బైబిలు కోర్సు ఆంగ్లములో ఉపదేశించబడును. కోర్సు అనంతరము ఆకర్షణీయమైన సర్టిఫికెట్ ఇయ్యబడును. ఇంగ్లీషు వచ్చిన వారు మాత్రమే 25 మందికి మించకుండా హాజరుకావచ్చును. ఆ సక్తిగల వారు యువకులైనా, స్త్రీలైనా, పురుషులైనా 0084-2363722కు ఫోన్ చేసి మీ పేరు నమోదు చేయించుకో గలరు.

2019 జనవరి నెలలో చిన్న పిల్లల కొరకు ఒక ప్రత్యేకకార్యక్రమము **LADS TO LEADERS** అనగా **బాలకుల నుంఢి పాలకులయ్యే వరకు** అనే కార్యక్రమము సిద్ధము చేయబడు చున్నది. దానిలో వందలాది బాలబాలికలు హాజరై నాయకత్వమును గూర్చిన శిక్షణ ఉచితముగా పొందవచ్చును. **లేడ్స్ టు లీడర్స్** (బాలకుల నుండి పాలకులయ్యే వరకు) అనే కార్యక్రమము సఫలమగునట్లు ప్రార్థించమనవి. మీ స్థానిక సంఘములలో నున్న బాలబాలికలు ఆ కార్యక్రమములో పాల్గొనునట్లు ఇప్పటి నుండి ప్రోత్సహించ మనవి.

ఇప్పుడే అందిన వార్త : 2018 సెప్టెంబరు మొదటి తేదీ నుండి సత్యవాణి **యుట్యూబ్** ఛానల్ ప్రారంభించబడినది. **YOU TUBE** లో **"SATYA VANI"** అని కొడితే మీరు 24 గంటలు సత్యవాణి కార్యక్రమములను వీక్షించవచ్చును. త్వరలో అనేక భాషలలో

ఆ ఛానల్ నుండి క్రీస్తు సంఘ కార్యక్రమములు ప్రసారము చేయబడును. మీ కార్యక్రమములను కూడ మేము ప్రసారము చేయగలము. జాషువా గారిని గాని రిక్కీ గారిని గాని సంప్రదించండి.

2018 డిశంబరునెల 2వ తేదీ ఆదివారము నుండి 6వ తేదీ శుక్రవారము వరకు **POLISHING THE PULPIT** అను బైబిలు లెక్చర్‌షిప్ కాకినాడలో జరుగును. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు ఆ సభలలో వాక్యోపదేశము గావించెదరు. ప్రతిరోజు స్త్రీలకు ప్రత్యేక బైబిలు తరగతులు అనుభవజ్ఞులైన స్త్రీల ద్వారా నిర్వహించబడును. ఈ కూటములలో ప్రపంచ నలుమూలల నుండి సోదర సోదరీలు హాజరవుదురు. సువార్తికులకు, స్త్రీ పురుషులకు యిది గొప్ప తరుణము. మీరు, మీ స్థానిక సంఘస్థులు హాజరవుటకు ఈ నాటి నుండియే సిద్ధపడండి. ఈ గొప్ప అవకాశము వినియోగించుకొనండి.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd.No. AP/KD-02/2018-20**

**From :**
**SATYAVAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.